# అమ్మ పెట్టేవి నాలుగూ....

## యన్. వి. ఈశ్వర్

అనుకోకుండా పక్కింటి దండపాణిగారు ఆయన భార్య ఒక రోజున ఎక్కడికో వెళ్ళవలసివచ్చింది. తిరిగివచ్చేదాకా అమ్మాయిని జాగ్రత్తగా చూడమని చెప్పి వెళ్లడంతో చిన్నపాప వసంత రక్షణభారం నాపై పడింది.

తోటి పిల్లలతో ఆడుకోడానికి పొరుగు కెళ్ళిన వసంత పరుగెత్తుకుని యింటికి వచ్చి చూసింది. తలుపు తాళం పెట్టి ఉండటం చూసి అమ్మ నాన్న తన్నెప్పటికీ విడిచి వెళ్ళిపోయారని రాగం మొదలుపెట్టింది. వసంత ఆరున్నొక్క రాగం వినపడ్డంతోనే నేను వెళ్ళి సముదాయించబోయాను. పెద్దగా అరుస్తూ మొహమంతా రక్కుకుని జుట్టంతా పీక్కుని రాగం శ్రుతి పెంచడంతో ఇంకా చాలా మెత్తగా తీయగా సముదాయించబోయాను.

బయట రోడ్డుమీద ఎందుకొచ్చిన గోల అనుకుని గట్టిగా చేతుల్లోకి తీసుకుని యింట్లోకి తీసుకొచ్చాను. అక్కడనించి కిందపడి దొర్లడం-అరవడం నానా అఘాయిత్యం!

'ఇదెక్కడి గోల! కర్మచాలక ఎవరయినా పిల్లను చంపేస్తున్నారనుకుంటే కొంపతీసి. నాకు గాభరా పుట్టి కిటికీలోంచి బయటికి చూద్దునుకదా ఇరుగుపొరుగు అమ్మలక్కలు ప్రశ్నార్థకంగా కిటికీల్లోంచి తొంగి చూస్తున్నారు! అందులో ఆడవాళ్ళు! గుండె గుభుక్కు మంది.

ఎన్నివిధాల చూసినా శాంతించదాయె గొడవ! ఆఁయ్ అంటూ కసురుకున్నాను. లోపలి గదిలోకి లాక్కుపోయాను.

చాలా ఓపికపట్టి చేసే రాద్ధాంతం అంతా ఓర్చుకున్నాను, అంతకన్న గత్యంతరం లేక.

ఇలా కొన్ని క్షణాలు గడిచాయి. మరి కొన్ని లక్షణాలు నడిచాయి.

కొన్నిసేపయిం తరవాత లోపలికి వెళ్ళి చూశాను. ఘోష పెట్టని సముద్రాన్ని చూసినంత పని.

పెడబొబ్బలూ, ఏడుపూ మాని వసంత నా టైపురైటరు ముందుకూర్చుని కాయితాలు అన్నీ లాగి నానాధ్వంసమూ చేస్తోంది. 'అద్దంకి వాగికి ఐశ్వర్యమొచ్చినా కష్టమే, దరిద్రమొచ్చినా కష్టమే' నన్నట్లు ఇందాక ఊరూ నాడూ ఏకంచేయడమూ నా, ఇప్పుడు ఈ గొడవా నా అనుకుంటూ దగ్గరి కెళ్లాను.

వసంత టైపురైటరు ముందు ఉద్యోగ హోదాలో కూర్చున్నట్టే కూర్చున్నది. అక్షరలక్షలతో అక్కడి కాయితాల్ని శిక్షించింది వసంత.

దృష్టిమరల్చాలి లేకపోతే టైపురైటరూ, కాయితాలూ అన్నీ ధ్వంసమే. ఎలా? కాస్సేపు ఆలోచించాను.

మంచి సంగీతం ఉందికదా అని రేడియో పెట్టాను. కమ్మని పాటకయినా కన్నుమూసి నిద్రపోతుందేమోనని. కనీసం దృష్టి మళ్లుతుందేమోనని. పిల్లల మనస్సులు చాలా గమ్మత్తుగా ఉంటాయి. వెంటనే వసంత లేడిపిల్లలా చెంగున గెంతుతూవచ్చి రేడియో బగబరా తిప్పటం మొదలెట్టింది ఇంకేముంది ... టైపురైటరు కావు రేడియో కొచ్చిందని గల్లంతు పడ్డాను.

'నాకు సిలోనే కావాలి. ఏం మీ రేడియోమీద సిలోనే రాదేం' అని మొహమంతా కందగడ్డచేసుకుని, బుంగమూతి పెట్టి అడిగింది వసంత.

'సిలోనే నీకిష్టమా' అన్నాను.

"ఊఁ నాకు సిలోనే కావాలి. ఈ వెధవ పాటలొద్దు" గారాంగా సాగతీస్తూ అన్నది.

ఆక్షణంలో మా రేడియో మీద సిలోన్ రాదంటంకన్న అవమానం వేరేయేంలేదు. అప్పటికప్పుడు సిలోనుకు తిప్పక పోయినా వసంతవాళ్ల నాన్నగారికి ఫిర్యాదు చేస్తుంది. నేను ముద్దాయినై పోతాను.

క్షణం ఆగకుండా తక్షణం సిలోన్ పెట్టేశాను.

'కాఫీ తాగమ్మా' అని తెచ్చి యిచ్చాను. 'ఉహుఁ!' అని తల అడ్డంగా తిప్పింది. 'పోనీ పాలు తాగుతావా? మరి ఓవల్టీన్—'? అన్నిటకీ తల అడ్డంగానే తిప్పింది.

సిలోన్ రేడియో అంటే ఇంతున్నానో లేదో, వీళ్ల దగ్గర్నుంచీ అంతా చెవికోసుకోడమే, అనుకున్నాను చిరంజీవి వసంత దివి ఆ గానమాధుర్యంలో మునిగి తేలుతోంది. ఆపాటలముందు కాఫీ ఓవల్టిన్ ఏమీ గుర్తించేట్టు లేవనుకున్నాను.

సరే వసంత అలా కూచున్నాక పట్టాన మంచిదే ననుకుంటూ మెల్లిగా పుస్తకం తీసుకుని గ్రంథసమాధిలో మునిగాను.

ఇంతలో మళ్లీ ఏంవచ్చిందో చివ్వున దూసుకువచ్చి చేతులో పుస్తకం కొస్తా లాక్కుని అవతల పారేసింది-వసంత. వద్దు మన్నది. ఏంచేయను? ఏంచేసినా మళ్లీ రణరంగమే కొంప. చేసుకున్నవారికి చేసుకున్నంత మహాదేవా అనుకుంటూ చేతులు ముడుచుకూర్చున్నాను.

'నాన్నా అమ్మా' కావాలి అంటూ మళ్ళీ ప్రారంభించింది. మళ్లీ గాలివాన చెలరేగుతుందేమోనని నాకు అదురు ప్రారంభమైంది.


'చూడమ్మా పాపా అమ్మా నాన్నా ఇప్పుడే వస్తారుగాని మంచిదానివి కదూ- చక్కగా సిలోన్ పాటలువిను-' అని ఏమార్చబోయాను. నిముష నిముషానికి ప్రశ్నలు ఒకటికాదు రెండుకాదు, ఎక్కడికెళ్లారు? ఎందుకెళ్లారు? నన్ను తీసికెళ్లలేదేం? ఇత్యాదిగా ప్రశ్నలవాన తుంపర పరంపరలో సతమతమైపోయాను.

మళ్ళీ రణగొణధ్వనిగా ఏడుపు మొదలు, ఏమిటయ్యా గొడవఅంటే, అర్జంటుగా


PAKCO ప్యాకో స్లో-స్పీడ్, కోల్డు స్టారింగ్ క్రూడ్ ఆయిల్ ఇంజనులు

—: ప్రత్యేక లక్షణములు :—

* పనిచేయ ప్రారంభించుట తేలిక
* తక్కువ ఇంధన ఖర్చు
* క్రమమైన నడక
* దిట్టమైన నిర్మాణం
* ఎక్కువ మన్నిక
* అద్భుతంగా పనిచేయును
* బాష్ ఫ్యూయెల్, ఇంజక్షన్ పరికరములు



మద్రాసు ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రములకు ఏజెంట్లు :

K. S. SHIVJI & CO., (Estd 1903)

Grams · "LAMP"

Phone :3617

పోస్టు బాక్స్ నెం. 5, 178-79 బ్రాడ్వే, మద్రాసు-1.

టాక్సీ తీసుకొచ్చి అమ్మనాన్న ఉన్నచోటికి తీసుకెళ్లాలి-తప్పదురా భగవంతుడా అని టాక్సీ తీసుకొచ్చాను. వసంత పంతం నెగ్గింది. అయితే ఎక్కడికని పోవడం? దండపాణి గారూ వాళ్లు ఎక్కడికెళ్లారో సరిగా తెలీదు. మహాపట్నంలో ఎక్కడుంటారని? ఒక్కసారి నిటారుగా నిట్టూర్చాను. తోక లేని గాలిపటంలా టాక్సీ అయినకాడికి పోతోంది.

కారులో షికారు వసంతకు బలేబలేగా ఉంది. ఇక మళ్ళీ ప్రశ్నల పరంపర ఆ కనిపించే మేడవైపో, ఈపోయే కారువైపో చూపించి ఏవో ప్రశ్నలడుగుతుంది. క్షణం విరామంలేకుండా అన్నీ క్షుణ్ణంగా నాకు తెలిసినట్లు, లేకపోతే అన్నిటికీ జవాబుదారీ నేనయినట్లు - గుక్క తిప్పుకోకుండా ఆమె అడిగే ప్రశ్నలకు నేను ఉక్కిరిబిక్కిరి అయిపోవటం, ఎలా బయటపడతాంరా బాబూ అని వేయిదేవుళ్లకు మొక్కుకున్నాను. ఆ చిలిపి ప్రశ్నలన్నిటికీ నాన్నలాగా నేను సమాధానాలిస్తానని తన ఉద్దేశ్యం కాబోలు. కొన్నింటికి సమాధానం నాతరం కాలేదు.

ఎనిమిదయింది. పిల్లకు ఆకలేస్తూ ఉండాలి. ఇంటికి పోనీమన్నాను డ్రైవర్ని- టాక్సీ ఇంటిముందు దిగడంతోనే మళ్ళీ మొదలు రగడ. ఆగోల లెక్క చేయనట్లు, సీరియస్‌గా మెట్లెక్కి లోపలికి పోయాను. కంచంలో అన్నం పెట్టి వసంతిముందు కూడా పెట్టాను. అన్నమైనా తింటుందేమోనని, ఏడుపు మానుతుందేమోనని.

నేను మాత్రం తినేశాను. మధ్యాహ్నం నుంచీ కాఫీకూడా తాగకుండా ఉన్నప్పటికీ పంతం పెట్టి కూర్చుంది అన్నం తినకుండా.

ఇహ మాట్లాడి ప్రయోజనం లేదనుకొని నిశ్శబ్దంగా చెయ్యి కడుక్కొని వచ్చేశాను. అన్నం ఎలా తిన్నానో ఏమో హాల్లోకివచ్చి కూర్చున్నాను: కాని మధ్య మధ్య బాధ్యత పీడిస్తుంటే రెండుమూడుసార్లు లోపలికి వెళ్ళి కంచంలో పదార్థం చెల్లిందో లేదో ఇవతలనుంచి తొంగిచూశాను. అయినొక్కరాగం మాత్రం అలా సాగుతూనే వుంది. చివరికి లోపలికివెళ్ళి ఎందుకమ్మా మాంఛిదానివి కదూ, మరి ఏడవక ఏంకావాలో చెప్పు.' అని బుజగిస్తూ అడిగాను. ఏం అన్నం బాగా లేదా-అమ్మయేం వేసిపెట్టేది అన్నాను.

ఏడుస్తూనే 'మా అమ్మ బోలెడు పెట్టేది! అన్నది వసంత.

అమ్మయ్య-అవేవో తెలిస్తే ఎలాగో అల్లా అవి పెట్టి ఊరుకోపెట్టవచ్చును కున్నాను. తర్వాత "చెప్పమ్మా బంగారు బాలవిచ్చుకవు కదూ, అమ్మ ఏం తెచ్చి పెట్టేదో చెప్పు" అని వందసార్లు ఓపికగా అడిగాను.

కోపంగా మూతి బిగించుకు చూస్తూ రాగం తీస్తుందిగాని బదులు ఎంతకూ చెప్పదు. రకరకాలుగా ఓపికను ప్రదర్శిస్తూ ప్రశ్నించాను. ఖర్మ! వివదాయె గొడవ-బుజ్జగించటం, ప్రతిమాలటం, బెట్టుచేయటం, ఎన్నెన్నో చేశాను. ఈ అవిధేయతకు

### ఎవరో తెలియక

ట్రాఫిక్ పోలీస్ సైకిలిస్టుతో: "ఆపవయ్యా అని గొంతు చించుకుంటే నీకు వినపట్టం లేదుటయ్యా?"

సైకిలిస్టు: "మీరుటండీ అన్నది! ఇందాక సైకిలుకింద పడ్డవాడేమో ననుకున్నానండీ."

సహించలేక ప్రాణంవిసిగి చేతికొద్దీ నాలుగు ఎడాపెడా అంటించాను. అబ్బ! నా చేతులే నెప్పిపెట్టాయి. ఎంత దెబ్బతగిలిందో ఎంతవరకు రావాలో అంతవరకూ వచ్చింది కథ అని లోపల స్పృహలో అనిపించింది.

చిత్రమేమిటోగాని, కిక్కురుమనకుండా పిల్లికూనలాగా వసంత కంచంలో అన్నం క్షణంలో తినేసింది. కళ్లనుంచి కారుతున్న నీలాలు చిట్టి ఎడమచేత్తో తుడుచుకుంటూ చిన్నారి వసంత వెక్కి వెక్కి ఏడుస్తూ 'రోజూ మా అమ్మ నాకు అన్నం తినేముందు పెట్టేవి ఇవే' అంటూ వీపున తేలిన దెబ్బలు చూపించింది.

జన్మ జన్మాల ఆర్ద్రత ఒక్కసారి ఉప్పొంగి హృదయం ద్రవించి నిలువునా నీరయి కుర్చీలో కూలిపోయాను. నిష్కృతి లేని యేదో గత కార్యానికి మనస్సు చివుక్కుమని, నరాలు జివ్వన లాగినయ్. కోటి ఆర్ద్రభావాల విద్యుదాఘాతానికి దెబ్బతిని సొమ్మసిలిపోయిన నేను వసంత పలకరింపుతో తేరుకుని చూశాను. చక్కగా చేతులూ కాళ్లూ కడుక్కొని వచ్చేసింది చిన్నారి వసంత. "నీ దగ్గిర పడుకుంటా. ఒంటరిగా నాకు భయం నిద్రరాదు." అన్న అమాయికత్వానికి గుండె చెరువై గాఢంగా కౌగలించుకున్నాను.

మరి కొద్దిక్షణాల అనంతరం నా పక్కమీద పడుకున్న వసంతను చూస్తే— హాయిగా ఆదమరచి దేవతలాగా నిద్రపోతోంది.

నాలో నాకో ఊహాగానం సన్నగా సాగింది.

"ఎన్ని విధాలా కానిపని ఒక్క దెబ్బతో అయిందే—ఏమి దివ్యస్పర్శ అందులో ఉందో కదా" అని ఆశ్చర్యపడ్డాను.

"అమ్మ పెట్టేవి నాలుగు పడితే నే గాని......" నీలిమబ్బులలో కిరణంలాగా ఊహాప్రపంచంలో ఏదో భావం ఒక్కసారి తళుక్కుమంది. ★



హాయిగా ఆదమరిచి దేవతలాగా నిద్రపోతోంది.